క్లుప్తంగా

కౌటాలలో కురిసిన వాన

కౌటాల: మండలంలో శనివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. ఎండల కారణంగా గత కొద్ది రోజుల నుంచి వేడిమికి మండల ప్రజలు అల్లాడిపోయారు. కాగా శనివారం ఆకాశం మేఘావృతమై వర్షం కురవడంతో మండలవాసులు ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందారు. అయితే వర్షం కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. చినుకు పడితే మండలం చీకటిమయంగా మారుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కౌటాల: సిర్పూర్(టి) మండలంలోని పెద్దబండ నుంచి లోనవెల్లి సబ్‌స్టేషన్ వరకు ఉన్న 33కేవీ లైన్‌లో మరమ్మతుల కారణంగా నేడు ఉదయం 8.30 గంటల నుంచి ఉదయం 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రవీందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సిర్పూర్(టి), కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్ మండలాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు విఠలేశ్వర ఆలయంలో సత్సంగ్

ఇచ్చోడ: మండల కేంద్రంలోని విఠలేశ్వర ఆలయంలో ఆదివారం ఉదయం 9 గంటలకు సత్సంగ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి వైష్ణవ సదన్ పీఠాధిపతి నారాయణ్ మహరాజ్ పాల్గొని ప్రసగించనున్నట్లు పేర్కొన్నారు. దాదాపుగా రెండు గంటల పాటు సత్‌సంగ్ కార్యక్రమం కొనసాగనున్నట్లు తెలిపారు.

రక్తదానం చేసేందుకు ముందుకు రావాలి

ఆదిలాబాద్‌రూరల్: చాలా మంది ఆదివాసీ గర్భిణులు రక్తహీనతతో బాధపడుతున్నారని, వారికి రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని మండలంలోని కేబీ కాలనీకి చెందిన, కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెద్మకి ఆనంద్‌రావ్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం డబ్బులి గ్రామానికి చెందిన గర్భిణి మెస్రం రేణుక బాయి రక్తహీనతతో బాధపడుతూ శుక్రవారం రిమ్స్ ఆసుపత్రిలో చేరారు. ఆమెకు రక్తం తక్కువగా ఉందని, వైద్యులు సూచించడంతో ఆమె కుటుంబసభ్యులు తనను సంప్రదించారన్నారు. వెంటనే రక్తదాతను గుర్తించి రక్తదానం చేయడం జరిగిందన్నారు.

ముమ్మరంగా ఉపాధిహామీ పనులు

తాంసి: తాంసి, భీంపూర్ మండలాల్లోని ఆయా గ్రామాల్లో ఉపాధిహామీ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రస్తుతం ఎలాంటి వ్యవసాయ పనులు లేకపోవడంతో కూలీల సంఖ్య పెరిగింది. తాంసి, వడ్డాడి, జామిడి, కప్పర్ల, పొన్నారి, పాలోదితో పాటు భీంపూర్ మండలంలోని కరంజి(టి), బెల్సరీరాంపూర్, ధనోర, నిపాని, పిప్పల్‌కోటి గ్రామాల్లో చెరువుల్లో కందకాల పనులు చేపడుతున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టీఏలు పనులను పర్యవేక్షిస్తున్నారు.

కంచె నిర్మించండి



ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

బోథ్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కొనసాగుతున్న జొన్న కొనుగోళ్లు



ఇచ్చోడ: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో జొన్నల కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి. మార్కెట్ పరిధిలోని ఇచ్చోడ, సిరికొండ, గుడిహత్నూర్ మండలాల్లో 2119 మంది రైతుల నుంచి దాదాపుగా 40 వేల క్వింటాళ్ల జొన్నలు కొనుగోళ్లు చేసినట్లు సెంటర్ ఇన్‌చార్జి ఈశ్వర్ తెలిపారు. ఈనెల 29 బుధవారం నుంచి కొనుగోళ్లను నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

కలగా భగీరథ జలం

- రాజీవ్‌నగర్‌లో సరఫరా కాని నీరు
- లీకేజీలకు మరమ్మతులు చేయని వైనం
- ఎనిమిదేళ్లుగా నీరు రాక ప్రజల ఇబ్బందులు
- బోరింగులపైనే ఆధారపడుతున్న గ్రామస్తులు



నాసిరకం పనులతో దెబ్బతిన్న మెట్లు



నిరుపయోగంగా మిషన్ భగీరథ ట్యాంకు

వాంకిడి: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రతీ ఇంటికి శుద్ధజలం అందించేందుకు మిషన్ భగీరథ పథకాన్ని గత ప్రభుత్వం తీసుకొచ్చింది. మారుమూల పల్లెల్లోనూ కోట్ల రూపాయలు వెచ్చించి ట్యాంకుల నిర్మాణం, ఇంటింటికీ నల్లా కనెక్షన్‌లు ఏర్పాటు చేశారు. కానీ అధికారులు చేసిన నిర్లక్ష్యానికి మిషన్ భగీరథ తాగునీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. మండలంలోని బంబార గ్రామ పంచాయతీ పరిధి రాజీవ్‌నగర్ గ్రామంలో నీళ్ల ట్యాంకు నిర్మించి ఇంటింటికీ నల్లా కనెక్షన్‌లు ఇచ్చారు. కానీ ఇప్పటికీ బిందెడు నీళ్లు పట్టింది లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఎక్కడ చూసిన లీకేజీలతో ఎత్తు ప్రాంతాలకు నీరు సరఫరా కావడం లేదు. కొన్ని వీధుల్లో రోడ్డు మధ్య నుంచి పైప్‌లైన్ వేయడంతో సీసీ రోడ్డు కారణంగా లీకేజీలకు మరమ్మతులు చేయలేని పరిస్థితి నెలకొంది.

ఎనిమిదేళ్లుగా నిరీక్షణ..

మిషన్ భగీరథ శుద్ధ జలం కోసం రాజీవ్ నగర్ గ్రామస్తులు ఎనిమిదేళ్లుగా నిరీక్షిస్తున్నారు. గ్రామంలో నీళ్ల ట్యాంకు నిర్మించి, ఇంటింటికీ పైపులైన్ వేసి తాగునీరు సరఫరా చేశారు. నాసిరకం పనులతో కొన్ని రోజుల్లోనే పైప్‌లైన్‌లో లీకేజీలు ఏర్పడ్డాయి. దీంతో ప్రారంభంలోనే నీటి సరఫరా నిలిపివేశారు. అడపాదడపా మరమ్మతులు చేపట్టినట్లు లీకేజీలు ఉన్న ప్రాంతాల్లో గుంతలు తవ్వుతూ వదిలేస్తున్నారు. తూతూ మంత్రంగా చేపట్టే మరమ్మతులతో నాలుగైదు ఇళ్లకు మాత్రమే నీటి సరఫరా జరుగుతుండగా, 80శాతం నివాసాలకు నీరు అందడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

నాసిరకం పనులు

మిషన్ భగీరథ పథకంలో చేపట్టిన నాసిరకం పనులు తేలిపోతున్నాయి. రాజీవ్‌నగర్ గ్రామంలో నిర్మించిన నీళ్ల ట్యాంకు ఇప్పుడే శిథిలావస్థకు చేరింది. ట్యాంకుపైకి ఎక్కేందుకు నిర్మించిన మెట్లు దెబ్బతిన్నాయి. దీంతో ట్యాంకుపైకి ఎక్కి అందులోకి దిగి ట్యాంకు శుభ్రం చేయడం అసాధ్యంగా మారుతుంది. ఒకవేళ మరమ్మతులు చేపట్టి నీటి సరఫరా ప్రారంభించినా కలుషిత నీరే దిక్కవుతుందని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు.

ఇప్పటివరకు నీరు రాలేదు



మా ఇంటికి ఇప్పటివరకు నల్లా నీరు రాలేదు. గ్రామంలో ట్యాంకు నిర్మించి కొన్ని సంవత్సరాలు గడిచినా బోరింగ్ నీళ్లపైనే ఆధారపడుతున్నాం. నల్లాలు బిగించిన ప్రారంభంలో సన్నటి ధారలా నీరు వచ్చేది. కానీ కొన్ని రోజులకు మొత్తంగా నీరు రావడం బంద్ అయింది.

– మేడి శోభ, రాజీవ్‌నగర్

చర్యలు తీసుకోవాలి



గ్రామంలో కొన్ని ఇళ్లకు అప్పుడప్పుడు సన్నటి ధారలా నీరు వస్తుంది. అది కూడా ఒక బిందెడు నీళ్లు మాత్రమే వస్తాయి. దీంతో అన్ని అవసరాలకు బోరింగ్ నీరే వాడుతున్నాం. ట్యాంకును శుభ్రం చేసి మరమ్మతులు చేపట్టి ప్రతీ ఇంటికి సరిపడా నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

– కమ్మరి లత, రాజీవ్‌నగర్

అధికారులు స్పందించడం లేదు

రాజీవ్‌నగర్ గ్రామంలో మిషన్ భగీరథ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మిషన్ భగీరథ జేఈ, డీఈలకు పలుమార్లు సమస్య విన్నవించాం. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. సమస్యను గ్రామస్తులతో కలిసి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం.

– అయ్యూబ్, మాజీ సర్పంచ్, బంబార

లూజ్ విత్తనాలు కొనుగోలు చేయొద్దు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈవో రాము

ఆసిఫాబాద్‌రూరల్: రైతులు లూజ్ విత్తనాలు కొనుగోలు చేయొద్దని ఏఈవో రాము అన్నారు. శనివారం మండలంలోని వావుదాం, మానిక్‌గూడ, గోవింద్‌పూర్ గ్రామాల్లో నకిలీ పత్తి విత్తనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లూజ్ విత్తనాలు కాకుండా ప్యాకెట్ విత్తనాలను షాపులో మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు చేసిన రశీదును పంట పూర్తయ్యే వరకు భద్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామాల్లో లూజు విత్తనాలు అమ్మినా, తీసుకున్నా సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి మోసపోకుండా నాణ్యమైన రకం విత్తనాలు తీసుకోవాలన్నారు.

యూనిఫాం కుట్టు కేంద్రాల పరిశీలన



కుట్టుకేంద్రాలను పరిశీలిస్తున్న అధికారులు

లింగాపూర్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నూతనంగా యూనిఫాంలు కుట్టే బాధ్యతలను అధికారులు మహిళా సంఘాలకు అప్పగించారు. మండలంలోని జై జగదాంబ మండల సమాఖ్య సంఘం ఆధ్వర్యంలో లింగాపూర్, పిక్లాతండా, జాముల్‌ధరా, మోతిపటార్, మామిడిపల్లి, దంపూర్, కంచన్‌పల్లి, గుమ్నూర్, చోర్‌పల్లి, కిమానాయక్‌తండా వంటి గ్రామాల్లో మహిళా శక్తి కుట్టు కేంద్రాలు ఏర్పాటు చేశారు. మండలంలోని 46 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 1241 యూనిఫాంలు సిద్ధం చేస్తున్నట్లు డీపీఎం సారయ్య, ఏపీఎం దేవానంద్ తెలిపారు.

కౌలుకు ఆలయ భూముల వేలం



వేలం నిర్వహిస్తున్న అధికారులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడలోగల మినీ ఫంక్షన్ హాల్‌లో శ్రీకేశవనాథ స్వామి ఆలయ భూములకు ఏడాది కౌలు నిమిత్తం శనివారం బహిరంగ వేలం నిర్వహించారు. వేలం ద్వారా ఆలయానికి రూ.15.16లక్షల ఆదాయం సమకూరినట్లు దేవాలయ కార్యనిర్వహణ అధికారి గర్రెపల్లి వేణుగోపాల్ గుప్తా, గంగాపూర్ వేంకటేశ్వరస్వామి ఆలయ అధికారి బాపిరెడ్డి తెలిపారు. జన్కాపూర్ శివారులోని 80/అ,ఆ, 81, 82, 83, 84, 85 సర్వే నంబర్లలోని భూములకు నిర్వహించిన వేలంలో 12 మంది రైతులు డిపాజిట్ చెల్లించి పాల్గొన్నట్లు పేర్కొన్నారు. జన్కాపూర్ గ్రామంలోని ఆరు సర్వే నంబర్లలో ఐదు సర్వే నంబర్ల పరిధిలోని 65 ఎకరాల భూమిని వేలంలో రైతులు దక్కించుకోగా, రూ.15.16లక్షల ఆదాయం సమకూరిందని తెలిపారు. గత సంవత్సరంతో పోల్చగా ప్రస్తుతం రూ.80వేల ఆదాయం అదనంగా సమకూరినట్లు పేర్కొన్నారు. మిగతా 85 సర్వే నంబర్‌లోని 13.21 ఎకరాల భూమికి వేలం నిర్వహించే తేదీని త్వరలో ప్రకటిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వైరాగడే మనోజ్‌కుమార్, ఆలయ అర్చకులు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేయొద్దు



స్కానింగ్ సెంటర్ పరిశీలిస్తున్న సుధాకర్‌నాయక్

ఆసిఫాబాద్‌అర్బన్: స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు చేయొద్దని డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్ ఆదేశించారు. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి తుకారాం భట్ ఆదేశానుసారం శనివారం జిల్లా కేంద్రంలోని శ్రీనివాస స్కానింగ్ సెంటర్‌ను సుధాకర్‌నాయక్ తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లా అంతటా లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై అవగాహన కల్పించామని చెప్పారు. అర్హులైన వైద్యులు మాత్రమే చికిత్స అందించాలని సూచించారు. స్కానింగ్ సెంటర్, ఆస్పత్రులను పరిశుభ్రంగా ఉంచాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ప్రోగ్రాం అధికారి సిద్ధార్థ, డిప్యూటీ డెమో నాగలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ మణికాంత్ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అప్పగిస్తున్న సీఐ శంకరయ్య

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని కాపువాడకు చెందిన గాడి అంజయ్య అనే వ్యక్తి తన సెల్‌ఫోన్ పోగొట్టుకొని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా శనివారం పట్టణ సీఐ తుత్తురు శంకరయ్య బాధితుడికి ఫోన్ అప్పగించారు. అంజయ్య గత నాలుగు రోజుల క్రితం పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌ను గుర్తించి బాధితుడు అంజయ్యకు అప్పగించారు.

విద్యుత్‌షాక్‌తో ఎద్దు మృతి



మృతి చెందిన ఎద్దు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని కొత్త సారసాల గ్రామానికి చెందిన సత్యంశెట్టి తిరుపతి అనే రైతుకు చెందిన ఎద్దు శనివారం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. మేతకు వెళ్లిన ఎద్దు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ తీగలకు తగిలి మృతి చెందినట్లు బాధిత రైతు తెలిపారు. మృతి చెందిన ఎద్దు విలువ రూ.80 వేలు ఉంటుందన్నారు. అధికారులు స్పందించి నష్టపరిహారం అందించాలని కోరారు.

పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలి



పనులు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో ఫణిందర్

ఇచ్చోడ: పారిశుధ్య పనులను పకడ్బందీగా చేపట్టాలని ఆదిలాబాద్ డీఎల్‌పీవో ఫణిందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో పోస్టాఫీసు వద్ద చేపట్టిన పారిశుధ్య పనులను పరిశీలించి స్థానిక పంచాయతీ సిబ్బందితో మాట్లాడారు. రానున్న వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా ముందస్తుగా పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు. చెత్తాచెదారం తొలగించాలని ఆదేశించారు. ఆయన వెంట పంచాయతీ ఈవో సూర్యప్రకాశ్, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

అప్ అండ్ డౌన్ కొలువులు!



చింతలమానెపల్లి తహసీల్దార్ కార్యాలయం

- స్థానికంగా ఉండని మండల అధికారులు
- ఇతర ప్రాంతాల నుంచి విధులకు..
- కుంటుపడుతున్న అభివృద్ధి

చింతలమానెపల్లి: ప్రజలకు సేవ చేసే అధికారులు స్థానికంగా ఉండకపోవడంతో మండలంలో అభివృద్ధి కుంటుపడుతోంది. మండలంలో విధులు నిర్వహిస్తున్న అధికారులు ఇతర ప్రాంతాల నుంచి వచ్చి విధులకు హాజరవుతున్నారు. చింతలమానెపల్లి మండలం నూతనంగా ఏర్పాటు కాగా మండలంలో అందుబాటులో ఉన్న భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేశారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలల్లో పోలీస్‌స్టేషన్, రెవెన్యూ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయాలు ఏర్పాటు చేసి సేవలందిస్తున్నారు. వ్యవసాయ, విద్యాధికారి కార్యాలయాలను కౌటాల మండలంలోని కార్యాలయాల నుంచి నిర్వహిస్తున్నారు. ఇంజనీరింగ్ శాఖల అధికారులు కాగజ్‌నగర్‌లోని శాఖా కార్యాలయాల నుంచి లేదా ఆయా అధికారుల వ్యక్తిగత కార్యాలయాల నుంచి విధులు నిర్వహిస్తున్నారు.

స్థానికంగా ఉండని అధికారులు..

ప్రధాన ప్రభుత్వ కార్యాలయాలు తహసీల్దార్, ఎంపీడీవో, విద్య, వైద్యశాఖలకు సంబంధించిన అధికారులు స్థానికంగా ఉండకపోవడం గమనార్హం. ఎంపీడీవో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఎంపీడీవో కోట ప్రసాద్, ఏపీవో గోవర్ధన్ సింగ్‌లు కాగజ్‌నగర్ నుంచి, జూనియర్ అసిస్టెంట్ పెంటు కౌటాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. మండల పరిషత్ శాఖలో ఉద్యోగులు సైతం మండలంలో నివాసం ఉండడం లేదు. తహసీల్దార్ నాగరాజు గౌడ్ కరీంనగర్ నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ఒక రోజుకన్నా ఎక్కువగా స్థానికంగా ఉండాల్సి వస్తే పొరుగు మండలం కౌటాల నుంచి రాకపోకలు నిర్వహిస్తున్నారు. డిప్యూటీ తహసీల్దార్ మష్కూర్ అలీ కాగజ్‌నగర్ నుంచి, ఆర్ఐ విజయ్‌కుమార్ కాగజ్‌నగర్ నుంచి, సీనియర్ అసిస్టెంట్ జాఫర్ సిర్పూర్ నుంచి రాకపోకలు నిర్వహిస్తున్నారు. మండలంలోని ఆయా పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కొంతమంది మంచిర్యాల, వరంగల్, కరీంనగర్‌ల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు.

ప్రభుత్వ నిబంధనలు..

ప్రతీ ఉద్యోగికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం మున్సిపాలిటీ ప్రాంతాలలో 13శాతం, గ్రామీణ ప్రాంతాలలో 11శాతం ఇంటి అద్దె అలవెన్సులను ప్రభుత్వం అందజేస్తుంది. ఉద్యోగులు స్థానికంగా ఉండేందుకు ప్రోత్సాహంగా ఈ అలవెన్సులు అందజేస్తోంది. ఉద్యోగులు స్థానికంగా ఉంటే ప్రజలకు ప్రభుత్వపరంగా అందించే వసతులు, సేవలు, సంక్షేమ పథకాలను మరింత చేరువ చేసేందుకు అవకాశం ఉంటుంది. ప్రజల పరిస్థితులు, ఇబ్బందులు ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం ఉంటుంది. మండలంలో పోలీసు అధికారి మినహా ఇతర శాఖల అధికారులు ఎవరూ స్థానికంగా అందుబాటులో ఉండకపోవంతో మండలంలో అభివృద్ధి కుంటుపడుతుందని మండలవాసులు పేర్కొంటున్నారు.

స్థానికంగా ఉండాలి



మండలంలోని అధికారులు స్థానికంగా ఉండేలా జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి. అధికారులు అందుబాటులో లేకపోతే ప్రభుత్వ వ్యవస్థలపై నమ్మకం పోతుంది. అభివృద్ధి పట్ల అధికారులు బాధ్యతగా ఉండాలంటే స్థానికంగా ఉండాలి.

– లోదెల్లి ప్రవీణ్, చింతలమానెపల్లి

ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం



మండలం అభివృద్ధిలో వెనుకబడి ఉంది. మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పని చేయాలి. అధికారులు స్థానికంగా అందుబాటులో లేకపోవడంతో అభివృద్ధి జరగడం లేదు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం.

– దోని శ్రీశైలం, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి

అంబలి పంపిణీ



అంబలి పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

ఆసిఫాబాద్: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద శనివారం అంబలి పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు ఉబేద్‌బిన్ యాహియా, నాంపల్లి శంకర్, పుల్లూరి శంకర్, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

విరిగిన విద్యుత్ పోల్.. తప్పిన ప్రమాదం



పెంచికల్‌పేట్ -లగ్గాం ప్రధాన రహదారిపై శనివారం సాయంత్రం వీచిన భారీ ఈదురుగాలులకు విద్యుత్ పోల్ విరిగిపడింది. పంట పొలాలకు విద్యుత్ సరఫరా చేసే విద్యుత్ తీగలు రోడ్డుపై, పంటపొలాల్లో పడిపోయాయి. నిత్యం రద్దీగా ఉండి రాకపోకలు సాగే రహదారిపైన కరెంట్ పోల్ పడినా ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

– పెంచికల్‌పేట్